నిబంధనల ప్రకారం.. బ్యాంకులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ పీవోల ప్రత్యేక ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తాయి. ఐటీడీఏ పీవోలు.. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాకు సబ్సిడీని జమ చేయాలి. కానీ, బ్యాంకు ఇచ్చే 30శాతం రుణంతో సంబంధం లేకుండా కేవలం సబ్సిడీ డబ్బులతో యూనిట్లకు కావాల్సిన సామగ్రిని లబ్ధిదారులకు ఐటీడీఏ అధికారులే అంటగడుతున్నారు. చాలా చోట్ల పాత సామగ్రిని ఇచ్చి, లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని వెళ్తున్నారు. సరైన సామగ్రి లేక తర్వాత ఆ యూనిట్లు మూలనపడుతున్నాయి. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొత్తగూడలో శ్రీముసలమ్మ ట్రైబల్ జేఎల్ గ్రూపునకు దాల్ మిల్ యూనిట్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచి తమ వాటాధనం 10 శాతం (రూ.4 లక్షలు) జమ చేశారు. నిబంధనల ప్రకారం దాల్ మిల్ యంత్రాల కొనుగోలు డబ్బులను బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ, ఆ యంత్రాలను ఓ మధ్యవర్తి ద్వారా ఐటీడీఏ అధికారులే కొనుగోలు చేసి తూతూమంత్రంగా మిల్లును ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు. ట్రయల్ రన్ పేరుతో ఆ యూనిట్‌ను మూడు రోజులు నడిపించిన సభ్యులు.. ముడి సరుకులు లేకపోవటంతోపాటు ఇంకా రావాల్సిన ఇతర యంత్రాలు లేక మిల్లును మూసేశారు. నాలుగేళ్లుగా ఆ దాల్ మిల్ నడవటం లేదు. మిగతా సబ్సిడీ సొమ్ము ఏమైందో ఎవరికీ తెలియదు. కాగా, గ్రూపు వాటాధనంగా బ్యాంకులో ఉన్న రూ.4 లక్షల్లో రూ.2.50 లక్షలు యూనిట్ కోసం ఇచ్చిన బంగ్లా మరమ్మతుల కోసమని కాంట్రాక్టర్ రంజిత్‌కు ఐటీడీఏ ఏపీవో ఆదేశాలతో ఇచ్చినట్లు గ్రూపు సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగివ్వలేదు. అలాగే.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు శ్రీరాయకపోడు ట్రైబల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎంఎస్ఎంఈ గ్రూపునకు కళాకృతుల తయారీ కోసం రూ.32.15 లక్షల రుణం మంజూరైంది. ఈ గ్రూపునకు సంబంధించిన 10శాతం వాటా ధనాన్ని (రూ.3.22 లక్షలు) బ్యాంకులో కాకుండా.. ఫోన్‌పే ద్వారా ఒక అధికారి తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నారు. భద్రాచలంలోని పాత ఎన్ఆర్‌సీ భవనంలో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులు ఈ యూనిట్ ఖాతాలో రెండు విడతల్లో రూ.5.50లక్షలు జమ చేశారు. అందులో నుంచి భవన మరమ్మతులు, సున్నం కోసమని రూ.4.50లక్షలు వాడేసుకున్నారు. ఆ కాంట్రాక్టును కూడా.. సదరు అధికారి తన దగ్గరి బంధువుకే సమర్పించేసుకున్నారు. రూ.1.50లక్షలతో కొంత సామగ్రి తీసుకొచ్చి ఆ భవనంలో ఉంచారు. ఈ యూనిట్‌కు రావాల్సిన సబ్సిడీ రూ.19.29 లక్షలు. అయితే కేవలం రూ.6 లక్షలే లెక్క చూపిస్తున్నారు. మిగతా రూ.13.29లక్షల సబ్సిడీ ఎవరి ఖాతాలోకి వెళ్లిందనేది చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుతో సంబంధం లేకుండా సబ్సిడీ నిధులను వాడటం నిబంధనలకు విరుద్ధం. శాఖ అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చినా పై అధికారుల దృష్టికి వెళ్లకుండా ఐటీడీఏ స్థాయిలోనే 'మేనేజ్' చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ కళాకృతుల తయారీ కేంద్రం కళతప్పింది.

మూడో ఉదాహరణ..

మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్లు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్లు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్రు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏదో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

- భూపతి శ్యామల, కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

» సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ

» కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్థక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

» కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు

» మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర

» హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్ననల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

» చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ.. బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

» దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

» సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.

నాగలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా గుమ్మడి విజయ్

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 19 : మండలంలోని రాగినేడు శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ చైర్మన్‌గా గుమ్మడి విజయ్‌ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఆలయంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకోని సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటి చైర్మన్‌గా గుమ్మడి విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ చైర్మన్ పోతురాజుల భూమయ్య, మాజీ సర్పంచ్ నాగపురి లీలావతి తిరుపతి, నేరెళ్ల లక్ష్మణ్, పడాల సత్యనారాయణ, తిరుపతి, శంకర్, రామ లక్ష్మణ్, జగన్నాథం, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో ఖోఖో శిక్షణ కేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 19: సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన ఖోఖో శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఖేలో ఇండియా పథకంలో భాగంగా సుల్తానాబాద్‌లో సెంటర్‌ను మంజూరు చేసింది. ఈ సెంటర్ ద్వారా ఐదేళ్ల పాటు ఖోఖో క్రీడల్లో ఆసక్తిగల బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక మార్కండేయకాలనీలో తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు మినుపాల ప్రకాష్‌రావు ప్రారంభించారు. ఖోచ్‌గా గెల్లు మధూకర్‌ను నియమించారు. జిల్లా యువజన క్రీడాశాఖాధికారి సురేష్, నాయకులు మినుపాల ప్రకాష్ రావు, సాయిరి మహేందర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, దామోదర్ రావు, గాజుల రాజమల్లు, ముస్తాఫా, బిరుదు రాధాక్రిష్ణ, వేగోళం అబ్బయ్య గౌడ్, కుమార్ కిశోర్, యూనిస్‌పాషా, మహేష్, అమిరిశెట్టి తిరుపతి, భైరగోని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 19: సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన హర్షవర్ధన్ అనే విద్యార్థి కరాటే జాతీయ స్థాయి పోటీలలో బంగారు పతకం సాధించారు. ఈనెల 18న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో రెండవ జాతీయ స్థాయి ఇన్విటేషన్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో హర్షవర్ధన్ కటాఫ్ 12 ఏళ్ళ విభాగంలో బంగారు పతకాలను సాధించారు. ఇతన్ని పాఠశాల కరస్పాండెంట్ డైరెక్టర్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియలు అభి ఇనందించారు.

వైభవంగా శ్రీవెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



పూజలు చేస్తున్న కొప్పుల ఈశ్వర్

ధర్మారం,ఫిబ్రవరి19: ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అంగరంగా వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంను నిర్వహించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సముద్రాల అశోక్‌రావు, జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దాడి సదయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పూస్కూరి జితెంద ర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి చేతుల మీదుగా జ్ఞాపిక అందజేత

ఎలిగేడు, ఫిబ్రవరి 19: కరీంనగర్‌లో జరుగుతున్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అక్కినపల్లి అభిరామ్‌కు ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా మెమెంటో సర్టిఫికెట్ అందజేశారు. చిన్న వయసులోనే తన గానంతో ఆకట్టుకుంటున్న అభిరామ్‌కు మంచి భవిష్యత్తు ఉందని మంత్రి పేర్కొన్నారు. భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్ ఫిబ్రవరి 19 : ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కింద స్కాలర్ షిప్/ఆర్థిక సహాయం కోసం అర్హత కలిగిన మైనార్టీస్ విద్యార్థులు మార్చి30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 19 : జపాన్‌లో హాస్పిటాలిటీ రంగంలో పని చేసేందుకు హోటల్ మేనేజ్మెంట్ సిబ్బందికి శిక్షణ, ఉద్యోగాల కోసం అర్హతగల అభ్యర్థులకు ఈనెల 20న జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, శంషాబాద్, హైదరాబాద్‌లో రెండో స్క్రీనింగ్ పరీక్ష జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్ నంబర్ 8125251408లో సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనంబులాద్రి స్వామి బ్రహోత్సవాలు



దేవునిపల్లిలోని లక్ష్మీనంబులాద్రి స్వామి దేవాలయం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 19: మండలంలోని దేవునిపల్లిలో ఉన్న శ్రీలక్ష్మీనంబులాద్రి స్వామి బ్రహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దాదాపు మూడు వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి(నంబులాద్రి స్వామి)వారు స్వయంగా వెలిశారని చెబుతారు. బండల మధ్య చిన్న గుహలాంటి ప్రదేశంలో స్వామి మూలమూర్తిగా ఉన్నారు. జిల్లా కేంద్రానికి నాలుగు, సుల్తానాబాద్ పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంటుంది. సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో మూడు వేల సంవత్సరాల క్రితం రెండు వందల మంది నంబులుఅర్చకులు, ఆచార్యులు) ఉండేవారట. అందుకే ఈ ప్రాంతంగా నంబులాద్రిగా పిలువబడుతోంది. ఈనెల 20న మంగళవారం స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. బుధవారం స్వామివారి హంస వాహన సేవ నిర్వహిస్తారు. గురువారం బలిహరణం, శుక్రవారం హన్‌మత్ వాహన సేవలు, శనివారం అత్యంత పవిత్రమైన సుదర్శన నారసింహ హోమం అనంతరం స్వామివారి శేష వాహన సేవలు ఉంటాయి. 25న ఆదివారం మహాపూర్ణాహుతి తర్వాత రాత్రి స్వామివారి గరుడ సేవ దీపోత్సవం, తిరుమంగై ఆళ్వార్ల చరిత్ర ప్రవచనాలు, 26న బ్రహోత్సవం చివరిరోజు స్వామివారి రథోత్సవం, జాతర నిర్వహిస్తారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ - క్రిటికల్ కేర్ భవనానికి శంకుస్థాపన

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 19: ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌న్ సింగ్ అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసీడీఎంఎస్ ఆధ్వర్యంలో రూ.16.2కోట్లతో నిర్మించతలపెట్టి 50పడకల క్రిటికల్ కేర్ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, సనఫక్రుద్దీన్, నాయకులు పెండ్యాల మహేష్, గుండేటి రాజేష్, తాళ్లపల్లి యుగంధర్, ఆర్ఎంఓ అర్చన, డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

మంథనిలో వంద పడకల ఆసుపత్రి : కలెక్టర్

మంథని, ఫిబ్రవరి 19: మంథని ప్రాంతం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తుందని, ఇందు అనువైన స్థలాన్ని ఎంపికచేయాలని మంత్రి ఆదేశాల మేరకు నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడించారు. సోమవారం కలెక్టర్ మంథని ప్రభుత్వ ఆసుపత్రిని, ఆసుపత్రిలో ఉన్న ఖాళీస్థలాన్ని పరిశీలించారు. మంథని ప్రభుత్వ ఆసుపత్రి భవనం పాతదైదని, ఎక్కువ మరమ్మతులు చేసే స్థితిలో ఉన్నందున, అలాగే ఆసుపత్రిలో ఎక్కువ ఖాళీ స్థలం అందుబాటులో ఉందని, మంథని ప్రభుత్వ ఆసుపత్రిని కూల్చివేసి, ఖాళీ స్థలం కలిపి అదే స్థలంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, మంథని ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మక్క జాతర ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



స్నానాల ఘాట్ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ

య్తెటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 19: గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. జాతర నిర్వహణలో భద్రత, ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులకు, పోలీస్ అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు. సమ్మక్క జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లుచేయాలని సూచించారు.

పెద్దపల్లి రూరల్ : జాతర కమిటీ సభ్యులతో పాటు అధి కారులు సమన్వయంగా ఉంటూ జాతర నిర్వహణ సజావుగా నిర్వహిం చాలని పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని హన్మంతునిపేటలో నిర్వహించే సమ్మక్క జాతర ఏర్పాట్లను ఏసీపీ, సీఐ కృష్ణలు పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ పొల్సాని సంపత్‌రావు, మాజీ సర్పంచ్ తీగల సదయ్య, కొమురయ్య, సతీష్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని మీర్జంపేట సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను సోమవారం సుల్తానాబాద్ సీఐ జగదీష్ పరిశీలించారు. ఎస్ఐ ఓంకార్, జాతర కమిటీ చైర్మన్ ఉయ్యాల అశోక్‌గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుమన్ పాల్గొన్నారు.

ఓదెల : మండలంలోని కొలనూర్ గుట్టల్లో 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లను సోమవా రం తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో తిరుపతి, పరిశీలించారు. జాతర చైర్మన్ దేవిడి శ్యామ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రామచంద్రం తదితరులున్నారు.

ఘనంగా శివాజీ జయంతి

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా జీఎం కార్యాలయం వద్ద ఉన్న శివాజీ విగ్రహానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్పొరేటర్లు బొంతల రాజేష్, ఎండీ ముస్తాఫా, తిప్పారపు శ్రీనివాస్, సమ్మారావు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దబొంకూర్‌లో మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. మడుపు కృష్ణమాచారి, కారుపాకల నాగరాజు, తిరుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పూసాల చౌరస్తాలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు సతీష్, బీజేపీ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తారం : శివాజీ జయంతి సందర్భంగా ముత్తారం ప్రభుత్వ పాఠశాలలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నుల పంపిణీ చేశారు. మండల సంయోజక్ కోటగిరి అంజిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మంథని : స్థానిక బ్రిడ్జి వద్ద శివాజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బెజ్జంకి డిగంబర్, సాయిరాం మోరే, వంగల తిరుమలేష్, తోరక్ ప్రవీణ్, రాము, శ్రీధర్, రమేష్‌చారిలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని ఆరేపల్లిలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఎంపీపీ సంపత్, జడ్పీటీసీ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ ఎంపీటీసీ సదానందం, దేవేందర్‌రావు, అశోక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మామిడాల రమేష్, కప్పల ప్రవీణ్, మండిగ ప్రవీణ్, బింగి రాజు, వంగ శ్రీకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి : బసంత్‌నగర్‌లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరామోజు ప్రసాద్ చారి, గుండ రమేష్, కన్నం వెంకటేష్, శ్రీరామోజు తిరుమలచారి, శ్రీనివాస్ తదితరులున్నారు.

జూలపల్లి : శివాజీ జయంతి వేడుకలను మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు కీర్తి, ప్రతిష్టలు తేవాలి

రామగుండం సీపీ శ్రీనివాసులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 19: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో కొత్తగా ఎంపికైన ట్రైనీ కానిస్టేబుళ్లు క్రమశిక్షణతో శిక్షణ పూర్తిచేసి పోలీస్‌శాఖకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. సోమవారం శిక్షణకు వెళుతున్న ట్రైనీ కానిస్టేబుళ్లతో సీపీ మాట్లాడారు. పరిస్థితులకు తగినట్టుగా ప్రజలకు సేవలందించే రీతిలో ట్రైనీ కానిస్టేబుళ్ల శిక్షణ తీసుకోవాలని చెప్పారు. శిక్షణను శ్రద్ధగా పూర్తి చేసి ఎలాంటి సమస్య వచ్చినా ఎదుర్కొనే విధంగా కానిస్టేబుళ్లు సేవలు చేయాలని, ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను ఇస్తూ అంచెలంచెలుగా ఎదగాలని కమిషనర్ సూచించారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి...

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీపీ ఎం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ అవగాహన ర్యాలీని ఎన్‌టీపీసీ మేడిపల్లి సెంటర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎన్‌టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు, మున్సిపాలిటీ టీ జంక్షన్, గోదావరిఖని చౌరస్తా, పైవింక్లయిన్ నుంచి చౌరస్తాలోని గాంధీ చౌక్ వరకు నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో జరిగిన కార్యక్రమాలో



ట్రైనీ కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

ఆయన మాట్లాడారు. అనంతరం అవగాహన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పెద్దపల్లి డీసీపీ చేతన్, గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, ఆర్‌టీవో రంగారావు, ఎంవీఐ భీమ్‌సింగ్, గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి ఒడికి చేరిన శిశువు

- మహిళతో పాటు జమ్మికుంటకు చెందిన డాక్టర్ అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 19: కరీంనగర్ మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) నుంచి శిశువును మహిళ అపహరించుకుపోయిన కేసును పోలీసులు 16 గంటల్లో చేదించారు. ఈ మేరకు కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం ముజఫర్ జిల్లాకు చెందిన మనోజ్‌రామ్, నర్మద ఆసిఫ్‌నగర్‌లో నివాసం ఉంటూ ఓ గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్నారు. నర్మద ఈనెల 16న కరీంనగర్ ఎంసీహెచ్‌లో చేరి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆమెకు ఫిట్స్ రావటంతో ఐసీయూలో చికిత్స అందిస్తూ శిశువుకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు మెటర్నిటీ వార్డులో తండ్రి మనోజ్‌రామ్ సంరక్షణలో ఉంచారు. ఆదివారం ఉదయం శిశువుకు సూర్యరశ్మి అందించేందుకు వార్డు బయటకు తీసుకువచ్చి టిఫిన్ చేసేందుకని మనోజ్‌రామ్ బయటకు వెళుతూ అతని సోదరుడి కొడుకును శిశువుకు కాపలాగా ఉంచాడు. ఉదయం 9 గంటలకు పెద్దపల్లి జిల్లా తక్కళ్లపల్లికి చెందిన బొమ్మ అలియాస్ ముక్కెర కవిత అలియాస్ పద్మ(35) ఎంసీహెచ్‌కు చేరుకుని ఎవరైనా శిశువును అపహరించుకుపోవాలని చూస్తూ హాస్పిటల్ మొత్తం తిరిగింది. మెటర్నిటీ వార్డు బయట శిశువుతో ఒక బాలుడు కనిపించడంతో అక్కడికి వెళ్లిన కవిత బాలుడితో మాట్లాడి వాక్సిన్ వేయాలని చెప్పి శిశువును తీసుకుని హాస్పిటల్ బయటకు వచ్చింది. బాలుడు కూడా ఆమె వెంట వెళ్లాడు. ఆటో వద్ద కొద్దిసేపు ఉండి బాలుడికి కొంత డబ్బు ఇచ్చి శిశువును తీసుకుని హాస్పిటల్ పక్క నుంచి మంచిర్యాల చౌరస్తాకు చేరుకుని అక్కడ ఆటో మాట్లాడుకుని బస్టాండ్‌కు వెళ్లింది. బస్సులో జమ్మికుంటకు చేరుకుని, అక్కడ తనకు పరిచయం ఉన్న డీహెచ్ఎంఎస్ డాక్టర్ ఎర్రమరాజు జగ్గంరాజు వద్ద శిశువును చూపించిన అనంతరం తక్కళ్లపల్లి తన ఇంటికి చేరింది. కవిత స్వగ్రామం కాల్వశ్రీరాంపూర్ మండలం జొన్నల మల్యాల కాగా మొదటి భర్తతో 15 ఏళ్ల ఒక బాలిక ఉంది. ఆమె అతనితో విడాకులు తీసుకుని అశోక్‌ను రెండో వివాహం చేసుకుంది. కవిత అత్తతో కలిసి తక్కళ్లపల్లిలో ఉంటుంది. రెండో భర్త హైదరాబాద్‌లో ఉంటుండగా కొద్ది నెలలుగా కవిత వద్దకు రావడంలేదు. కవితకు అబార్షన్ కావడంతో పిల్లలు పుట్టే అవకాశం లేకుండా పోయింది. దీంతో కవిత తనకు పరిచయం ఉన్న జమ్మికుంటలోని డాక్టర్ ఎర్రమరాజు జగ్గంరాజును సంతానం కోసం సంప్రదించింది. అతడి సలహా మేరకు, తన భర్త తనతో కాపురం చేయాలంటే తనకు శిశువు జన్మించిందని చెప్పి నమ్మించేందుకు రోజుల వయస్సు కలిగిన శిశువును అపహరించుకుపోవాలని నిర్ణయించుకున్న కవిత ఆదివారం ఉదయమే ఎంసీహెచ్‌కు వచ్చి తన ప్లాన్‌ను అమలు చేసింది. పోలీసులు శిశువుతో పాటు నిందితురాలు కవితను తక్కళ్లపల్లిలోని ఆమె ఇంటిలో అరెస్టు చేశారు. ఆమెతోపాటు డాక్టర్ ఎర్రమరాజు జగ్గంరాజుపై కిడ్నాప్, ఇతర సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. శిశువును తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. సమావేశంలో ఏసీపీతో పాటు రెండో టౌన్ సీఐ వెంకటేష్, స్పెషల్‌బ్రాంచి సీఐ సృజన్‌రెడ్డి, జమ్మికుంట సీఐ రవికుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ కిరణ్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

తోట రమేష్‌కు ఓయూ డాక్టరేట్



పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 19: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన తోట రమేష్ ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వీబీ నరసింహ పర్యవేక్షణలో యాన్ ఇంటిగ్రేటెడ్ క్లౌడ్ కంప్యూటింగ్ ఫ్రేమ్ వర్క్ విత్ హైబ్రిడ్ అట్రిబ్యూట్ బేస్డ్ ఎన్క్రిప్షన్ అండ్ మల్టీ లేయర్ ఎన్క్రిప్షన్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు.

'ట్రాఫిక్ నియమాలు పాటించాలి'

పాలకుర్తి, ఫిబ్రవరి 19: ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి కోరారు. రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా సోమవారం బసంత్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాలు ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా పీఆర్వో ఎచ్.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

మంథని, ఫిబ్రవరి 19: మంథని నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు చిత్రపటానికి యూత్‌కాంగ్రెస్ నేత ఎరుకల ప్రవీణ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం నుంచి మంథని నియోజకవర్గానికి రూ.33 కోట్లు, మంథనికి రూ.8కోట్లు మంత్రి శ్రీధర్‌బాబు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 19: మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెగడపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన రష్మిత మొదటి స్థానం సాధించింది. సోమవారం భౌతిక, జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ జెడ్‌పీహెచ్, కాల్వ శ్రీరాంపూర్‌లో నిర్వహించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఎంఎన్ఓ మహేష్ మండల బాధ్యులుగోలి కృష్ణ, బండారి జయప్రకాష్, కిష్, కోటిరెడ్డి అభినందించారు.

●ముత్తారం ఫిబ్రవరి 19: మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ సోమవారం ముత్తారం మండలం కేంద్రంలో నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో మండల స్థాయిలో జడ్పీహెచ్ఎస్ పోతారం పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జి.త్రినేత్రకు ప్రథమ స్థానం, కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న పి.హరిని పి హర్షిని ద్వితీయ స్థానం పొందారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎన్ఓ ఓదెలు, ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మణ్, బద్రి, జి దేవేందర్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, రాధిక, సత్యనారాయణ మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విజేతలను ఎంఎన్ఓ ఓదెలు అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ముత్తారం, ఫిబ్రవరి 19: మండలంలోని అడవి శ్రీరాంపూర్‌లో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ దొడ్డ గీతారాణి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చొప్పరి రాకేష్, ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ, నాయకులు చాంద్ పాషా, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజీద్ పాషా, లక్కం ప్రభాకర్, ఆకోజ్ అశోక్, నాంసాని సదయ్య, మూగ రవి, భైరీ రాజు, మండల రవీందర్ ఉప్పు శంకర్, దొడ్డ మల్లయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 19: మండలంలోని పెద్దబొంకూరు గ్రామానికి చెందిన కారుపాకల లక్ష్మీరాజం, వీరయ్యలు మృతిచెందగా సోమవారం ఓదెల జడ్పీటీసీ రాములు, బీఆర్ఎస్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డిలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట మిట్టపల్లి శ్రీనివాస్, కల్వల తిరుపతిగౌడ్, పాతకుల అనిల్, బొంగాని వెంకటేష్, కారుపాకల వినోద్, రాజేశం, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఓదెల, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతిలో ఈనెల 15న ప్రచురితమైన 'సామూహిక మరుగుదొడ్లకు తాళం' అనే కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం గుంపులలోని మరుగుదొడ్లకు వేసిన తాళం తీసి ఉంచారు. కాగా మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిరుపయోగంగా ఉంచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని గుంపుల గ్రామస్థులు కోరుతున్నారు.

మల్లన్న ఆలయంలో వేలంపాట

ఓదెల, ఫిబ్రవరి 19: భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో సోమవారం పలు వ్యాపారాలకు వేలంపాటను నిర్వహించారు.ఇందులో ప్యాలాలు, పుట్నాలు, వంటచేరుకు, వాహనాల పార్కింగ్, తల్లి ఆరాధనకు వేలం వెయ్యిగా నిర్వహించగా, తల్లి ఆరాధన రూ29 వేలు, వంటచెరుకు రూ.1.56 లక్షలకు ఇద్దరు వ్యక్తులు వేలంపాడి దక్కించుకున్నారు. అలాగే వాహనాల పార్కింగ్, పుట్నాలకు మళ్ళీ వేలంపాటను 29 వరకు వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ తో పాటు ఈ ఓ సదయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు కనికి రెడ్డి సతీష్, చింతం మొగిలి, మ్యాడగొని శ్రీకాంత్, చింతం వెంకటస్వామి పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



రూపునారాయణపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, ఫిబ్రవరి 19: మండలంలోని రూపునారాయణపేటలో సోమవారం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆరెకుల సంక్షేమ సంఘం కమ్యూనిటీ భవనానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో నిర్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంకం రమేష్, ఆరెకుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన బీసీ సంఘం నాయకులు

జూలపల్లి, ఫిబ్రవరి 19. జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు జెట్టి సతీష్ ఆధ్వర్యంలో సోమవారం జూలపల్లి ఎస్ఐ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అంతకుముందు మండల కాంగ్రెస్ నాయకులు మానుమండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐని సన్మానించారు. ఈకార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు వేల్పుల గట్టయ్య, తువ్వ లింగయ్య పలువురు ఉన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జూలపల్లి, ఫిబ్రవరి 19: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకొని తమ తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఎస్ఐ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటికి బానిసలైతే ఎంతో విలువైన మీ జీవితాలు పాడైపోతాయన్నారు. విద్యార్థులు సోదర భావంతో కలిసిమెలసి ఉండి ఇతరురులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు కృషి చేయాలి

ధర్మారం, ఫిబ్రవరి19: పాల ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు కృషి చేయాలని కరీంనగర్ డెయిరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్‌రావు అన్నారు. సోమవారం ధర్మారం మండలం కొత్తపల్లి న్యూ గ్రామంలో కరీంనగర్ డెయిరీ ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన పాల సేకరణ కేంద్రం నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.శంకర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, గ్రామ పాల ఉత్పత్తి సంస్థ అధ్యక్షుడు మదాని కుమారస్వామి, పాలకవర్గ డైరెక్టర్లు, పాల ఉత్పత్తిదారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.



అడ్రియాల గనికి అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏపీఏ మేనేజర్ తిరుపతి

రామగిరి, ఫిబ్రవరి 19: భూగర్భ గనుల్లో ఆధునిక పరిజ్ఞాన వినియోగంలో అడ్రియాల గనికి అవార్డు లభించింది. ఒడిస్సా రాజధాని భువనేశ్వర్‌లో జరిగిన కన్సుమెట్-2024 సదస్సులో బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్ విభాగంలో బహుమతి లభించింది. అడ్రియాల మేనేజర్ తిరుపతి అవార్డును అందుకున్నారు. డీప్ అండర్ గ్రౌండ్ కోల్ మైనింగ్‌లో సమర్థత, భద్రత పెంచడం, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కూలింగ్ మరియు ట్యూబ్ బండిల్ గ్యాస్ మానిటరింగ్ సిస్టంలతో కూడిన అడ్రియాల కేస్ స్టడీని అధికారులు సమర్పించగా, దాని ఆధారంగా గని అవార్డులకు ఎంపికైంది.

పర్సనల్ డిపార్ట్‌మెంట్ పని విధానంపై సమీక్ష

య్తెటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 19: పర్సనల్ డిపార్ట్‌మెంట్ పని విధానంపై సింగరేణి పర్సనల్ జీఎం(ఐఆర్ పీఎం) హన్మంతరావు సోమవారం జీఎం ఆఫీస్‌లో రామగుండం ఏరియా-2,3 పర్సనల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఆర్జీ- 2,3 ఏరియాల వారిగా పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఎంపీఎఫ్, హెచ్‌ఎల్‌ఆర్ఎస్, మెడికల్‌కార్డు, క్వార్టర్ల కేటాయింపు, ఉద్యోగుల క్రమశిక్షణ చర్యలపై అధికారులతో చర్చించారు. నామినేషన్ ఫారాలను పూర్తి చేయించడం, పదోన్నతులు, డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ సమయంలో పేర్లు పంపించేటపుడు ఖచ్చితంగా నిబంధనల ప్రకారం అన్ని రకాల డాక్యుమెంట్లు పరిశీలన చేయాలని సూచించారు. పెండింగ్ ఫైల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పర్సనల్ అధికారులకు హన్మతరావు సూచించారు. ఈసమావేశంలో ఆర్జీ-2 పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, ఆర్జీ-2, ఆర్జీ-3 ఏరియాల పర్సనల్ మేనేజర్లు అనిల్‌కుమార్, రవీందర్‌రెడ్డి, డీవైపీఎంలు వేణుగోపాల్,



ఆర్జీ-2 అధికారులతో చర్చిస్తున్న హనుమంతరావు

వంశీధర్, శ్రీహరి, హరీష్, సీనియర్ పర్సనల్ అధికారి రవిచంద్ర, వెల్ఫేర్ ఆఫీసర్లు సాయికృష్ణ, రాజు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

రామగిరి, ఫిబ్రవరి 19: ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వి కే శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆర్జీ-3, ఏపిఏ డివిజన్‌ల పరిధిలోని ఓసీపీ-2, ఏఎల్‌పీ ప్రాజెక్టులను సందర్శించారు. ఓసీపీ-2 హైవాల్ ఏరియా, 3వ సీమ్, ఏఎల్‌పీ పీఈ-2, పీఈ-3లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు సత్వరం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థ నిర్ధేశించిన లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. అధికారులు సుధా



పని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్(ఆపరేషన్స్)

కర్‌రావు, నాగేశ్వర్‌రావు, వెంకటరమణ, నాగరాజు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల డిజిటలైజేషన్‌పై సమీక్ష

రామగిరి, ఫిబ్రవరి 19: ఆర్జీ-3,ఏపీఏ ఉద్యోగుల పర్సనల్ ఫైల్స్‌లోగల వివిధ రికార్డులను డిజిటలైజేషన్‌పై సోమవారం జీఎం కార్యాలయంలో పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఉద్యోగికి సంబంధించిన రికార్డులకు ఆధారంగా డిజిటలైజేషన్ కోసం ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు శ్రీహరి, హరీష్, రవిచంద్ర, సాయికృష్ణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.